సాక్షి తిరుపతి

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



మళ్లీ జగనన్నే రావాలి

రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్.జగనే రావాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆకాంక్షించారు. - IIలో



జనహృదయనేత జగనన్న

జనహృదయ నేతగా సీఎం జగనన్న ప్రజల హృదయాల్లో నిలిచారని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. - IIలో



'గురుకులం'తో అభివృద్ధి

శ్రీస్వామినారాయణ అంతర్జాతీయ గురుకుల విద్యాపీఠంతో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. - IIలో

న్యూస్‌రీల్

27 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు పరీక్షల నియంత్రణ అధికారి ధామ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఒకటి, మూడు, ఐదు సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ)కు సంబంధించి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మొదటి సెమస్టర్ పరీక్ష ఉదయం, మూడవ సెమిస్టర్ పరీక్ష మధ్యాహ్నం అలాగే తర్వాత రోజు ఐదవ సెమిస్టర్ పరీక్షలను ఆయా తేదీల్లో నిర్వహించేందుకు టైంటేబుల్ సిద్ధం చేశామన్నారు. ఒక్కో సెమిస్టర్‌కు సుమారు 22 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూర్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 75 సెంటర్లు పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

18న ప్రతిష్టాత్మకంగా విశ్వభారత సంకల్ప యాత్ర



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ఈనెల 18న తిరుపతి వేదికగా ప్రతిష్టాత్మకంగా విశ్వభారత సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీజ్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని, సభకు అవసరమైన విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, మెప్మా పీడీ రాధమ్మ, ఎస్ఈ మోహన్, ఎంఈఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీఆర్‌డీఏ జ్యోతి, డీఎస్‌వో రఘువీర్, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, ఎంఈవో బాలాజీ, మేనేజర్ చిట్టిబాబు, సూపరింటెండెంట్ రవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగ కమిటీల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురికి పదవులు కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లా పరిధిలో రాష్ట్ర మైనారిటీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా వి.ఖాదర్‌బాషా, జోనల్ ఇన్‌చార్జి (జోన్-8) ఎస్ఎఫ్ షరీఫ్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధిగా కే.జోషువా, కార్యదర్శిగా ఎ.ప్రిన్సిప్రియ, రాష్ట్ర వాణిజ్య విభాగం జోనల్ ఇన్‌చార్జి (జోన్-8) డీఎస్ వెంకటేష్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా డి.భక్తవత్సలం, కే.బాలసుబ్రమణ్యం, జి.మంజునాథ్, కే.నవీన్‌కుమార్, రాష్ట్ర వీవర్స్ వింగ్ సంయుక్త కార్యదర్శిగా ధనశేఖర్‌లను నియమించారు.

తిరుపతి జిల్లా పరిధిలో రాష్ట్ర బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా (జోన్-6) టి.పుల్లయ్య, కార్యదర్శిగా చిరంజీవి, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడిగా కే.మార్టిన్, కార్యదర్శులుగా ఎన్.నెల్సన్, సెల్వం, సంయుక్త కార్యదర్శిగా ఎం.రవికుమార్, రాష్ట్ర మైనార్టీ జోనల్ ఇన్‌చార్జి (జోన్-6) షఫీమహమ్మద్ ఖాద్రి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మస్తాన్, కార్యదర్శులుగా డి.ఎం.రఫీ, షేక్ అబ్దుల్ లతీఫ్, సంయుక్త కార్యదర్శిగా షేక్ అబ్దుల్, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా సి.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శిగా మురగయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడిగా పి.సత్యనారాయణశెట్టి, ప్రధాన కార్యదర్శిగా బీఎస్ గుప్త, కార్యదర్శిగా జే .శరత్‌కుమార్, రాష్ట్ర వీవర్స్ జోనల్ ఇన్‌చార్జి (జోన్-6) ఎం.హరి, ప్రధాన కార్యదర్శిగా ఎం.జానకిరామ్, కార్యదర్శిగా ఎస్.సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శిగా ఆర్.ఎ.హేమంత్‌రావ్‌లను నియమించారు.

అభివృద్ధికి అడ్డంకులు.. పచ్చి అబద్ధాలు!

'తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్ల టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్)పై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవాలే. నిరాధార, అసత్యాలతో ప్రజల్ని గందరగోళానికి గురిచేస్తున్నారు. కొంతమంది చేసిన ఆరోపణలు మమ్మల్ని తీవ్ర మనోవేదనకు గురిచేశాయి. పాలకుల సహకారంతో తిరుపతి అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్నాం. రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. చట్టం, నిబంధనల ప్రకారమే రోడ్ల అభివృద్ధికి స్థలాలు ఇచ్చిన యజమానులకు టీడీఆర్ బాండ్లను అందించాం. బాండ్లలో వాటి విలువ లేకున్నా ఇన్ని కోట్ల రూపాయలు ఇచ్చారని లెక్కలుగట్టి ఆరోపించారు. ఇది చాలా దుర్మార్గం. ఇలాంటి అబద్ధపు ప్రచారాలు అభివృద్ధికి అడ్డంకులుగా మారుతాయి. వీటిపై కౌన్సిల్ జాగ్రత్త వహించాలి' అని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సూచించారు. ఇటీవల టీడీఆర్ బాండ్లపై వచ్చిన ఆరోపణలపై వారు వివరణ ఇచ్చారు.

చట్టప్రకారమే టీడీఆర్ బాండ్ల అందజేత

- ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావులేదు
- అవగాహనా లోపంతో అధికారులపై అబాండాలు
- టీడీఆర్ బాండ్ల చట్టం 2017లో వచ్చింది
- 2019లో ఆమోదం పొందిన మాస్టర్ ప్లాన్ రోడ్లనే అభివృద్ధి చేస్తున్నాం
- టీడీఆర్‌పై కార్పొరేషన్ ఏసీపీ బాలసుబ్రమణ్యం వివరణ



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, కమిషనర్ హరిత



హాజరైన డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు

తిరుపతి తుడా: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో గురువారం మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్, ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. నగర మేయర్ డాక్టర్ శిరీష అధ్యతన నిర్వహించిన ఈ సమావేశానికి టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్ రెడ్డి, కార్పొరేటర్లు, కొ-ఆప్షన్ సభ్యులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రోడ్ల అభివృద్ధిపై చర్చించే క్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్ కలుగచేసుకుని మాట్లాడుతూ టీడీఆర్ బాండ్లపై కొంతమంది చేసిన ఆరోపణలు, కొన్ని పత్రికల్లో వచ్చిన అసత్య కథనాల వల్ల తిరుపతి అభివృద్ధిపై ప్రభావం పడేలా ఉందన్నారు. తిరుపతి అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న పాలకులు, అధికారులపై అబాండాలు వేసే ప్రయత్నం ప్రమాదకరంగా కౌన్సిల్ పరిగణించాలని కోరారు. సంబంధిత అధికారులు దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన రికార్డులను ఎవరు బయటకు లీక్ చేశారు? మరొకరి చేతికి ఇవి ఎలా వెళ్లాయన్నదానిపై విచారణ చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఏసీపీ బాలసుబ్రమణ్యం రికార్డులకు సంబంధించి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో పొందవచ్చని, ప్రస్తుతం చేపట్టేవన్నీ బహిర్గతమేనని, ఇందులో ఎలాంటి దాపరికాలు ఉండవని వివరణ ఇచ్చారు.

2017లోనే రూపొందించారు

టీడీఆర్ బాండ్ల విధివిధానాలు 2017లో అప్పటి ప్రభుత్వం రూపొందించిందని ఏసీపీ బాలసుబ్రమణ్యం కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. జీఓ ఎంస్ నం.119లో పొందుపరిచిన నిబంధనల ప్రకారమే టీడీఆర్ బాండ్లను విడుదల చేశామన్నారు. అలాగే పై జీఓకు సంబంధించి 2018లో విడుదలైన జీఓనం.223లో అమైన్మెంట్‌ను ప్రభుత్వం ఖరారు చేసిందన్నారు.

కమర్షియల్ ప్రాంతాల్లో కాలువల నిర్మాణానికి 2 రెట్లు, రోడ్డు నిర్మాణానికి స్థలాలు ఇచ్చిన యజమానులకు నాలుగు రెట్ల విలువతో బాండ్లు ఇవ్వాలని అందులో పొందుపరిచారన్నారు. 2019 మార్చిలో నాటి ప్రభుత్వం ఆమోదించిన తుడా మాస్టర్ ప్లాన్‌లోని రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు.

40 శాతానికి మించి అమ్ముకోలేరు

యజమానులు టీడీఆర్ బాండ్లను విక్రయించాలంటే వారు వదులుకున్న స్థలంతో పాటు నాలుగు రెట్లు విలువ ఉన్న వీటిలో కేవలం 40 శాతానికి మించి అమ్ముకోలేరని ఏసీపీ చెప్పారు. ఉదాహరణకు బాండ్ విలువ రూ.లక్ష ఉంటే రూ.35 వేలు నుంచి రూ.40 వేల వరకు అమ్ముడు పోయాయని, తన అనుభవంలో ఇప్పటి వరకు ఇంతకు మించి బాండ్లను విక్రయించిన దాఖలాలు లేవని ఆయన గుర్తిచేశారు. అలాంటిది బాండ్ విలువ కంటే 40 శాతం ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారని చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలన్నారు.

పాలకుల సహకారంతోనే అభివృద్ధి

పాలకుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఏసీపీ బాలసుబ్రమణ్యం చెప్పారు. గతంలో కొర్లగుంట, డీబీఆర్ వంటి అనేక రోడ్ల అభివృద్ధికి తానే స్వయంగా పలుమార్లు మార్కింగ్ ఇచ్చానన్నారు. అయినా దశాబ్దాలుగా నగరంలో ఒక్కమాస్టర్ ప్లాన్ రోడ్డును కూడా వేయలేక పోయామని తన అనుభవాలను చెప్పుకొచ్చారు. కార్పొరేటర్లతో కమిటీ వేయడం వల్ల యజమానులను గుర్తించడం, వారికి అధికారుల మధ్య వారధిగా నిలివడంతోనే ఇంత వేగంగా రోడ్ల అభివృద్ధి సాధ్యమైందన్నారు. అధికారులపై లేనిపోని ఆరోపణలు చేయడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీఆర్ బాండ్లలో ధర విలువ ఉండదు

'రోడ్లు అభివృద్ధి చేయాలనుకున్నప్పుడు టౌన్ ప్లానింగ్ విభాగం సర్వే చేపట్టి హద్దులు నాటుతుంది. ఆ ప్రకారం స్థలాలు కోల్పోయిన యజమానులకు నోటీసులు జారీచేస్తుంది. ఆపై స్థల యజమానుల అంగీకారం తీసుకోవడం జరుగుతుంది' అని ఏసీపీ బాలసుబ్రణ్యం వివరణ ఇచ్చారు. కార్పొరేషన్‌కు గిఫ్ట్ డిడ్ రాయించుకోవడం వరకే తమ పరిధని, ఆపై సేల్ డీడ్, ఆ ప్రాంత భూముల విలువ కట్టడం సబ్‌రిజిస్ట్రార్ విధులన్నారు. ఎంత స్థలం కోల్పోయారు, నష్ట పరిహారం ఎన్ని రెట్లు ఇవ్వాలన్నది కూడా సబ్ రిజిస్ట్రార్ విధులేనన్నారు. ఆపై విజయవాడలోని డీసీటీపీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారని చెప్పారు. అక్కడి నుంచే బాండ్లు విడుదలవుతాయే తప్ప మున్సిపల్ కార్పొరేషన్‌కు గాని, పాలకులకు గాని సంబంధం ఉండదన్నారు. టీడీఆర్ బాండ్లలో యజమాని వదులుకున్న స్థలం ఎంత, దానికి ఎన్ని రెట్లు చెల్లించామనే వివరాలు ఉంటాయి తప్ప ఇన్ని లక్షల రూపాయలని ఉండదన్నారు. ధర విలువ బాండ్లలో లేకున్నా కోట్ల రూపాయలు లెక్కగట్టి విమర్శలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

తుపాను గాయం.. కావాలి సాయం!

- జిల్లాలో మిచాంగ్ విధ్వంసం
- పంటలు, రోడ్లు, విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం
- అన్నదాతలను పూర్తిస్థాయిలో ఆదుకోండి
- గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో కేంద్ర బృందం పరిశీలన



సూళ్లూరుపేట: వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి



గూడూరు నియోజకవర్గంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

తిరుపతి అర్బన్: 'మిచాంగ్ తుపాన్ బీభత్సం సృష్టించింది. పంట పొలాలను సర్వనాశనం చేసింది. రోడ్లను ధ్వంసం చేసింది. విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుపాను గాయం కారణంగా అన్నదాతలు అప్పులపాలు కావాల్సి వస్తోంది. మానవతాదృక్పథంతో ఆపన్నహస్తం అందించండి..' అంటూ ఎమ్మెల్యేలతోపాటు అధికారులు, అన్నదాతలు కేంద్ర బృందానికి విన్నవించారు. జిల్లాలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు మిచాంగ్ తుపాన్ విధ్వంసం సృష్టించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మీనా హోదాతో కూడిన బృందం జిల్లాలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటించింది. గూడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు వెలగపల్లి వరప్రసాద్‌రావు, కిలివేటి సంజీవయ్య, రాష్ట్రం నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర రత్నూ, రోడ్లు, భవనాల మంత్రిత్వశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ రాకేష్‌కుమార్‌తోపాటు జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ పెంచల కిషోర్, గూడూరు, సూళ్లూరుపేట ఆర్డీవోలు కిరణ్‌కుమార్, చంద్రముని, తహసీల్దార్లు కేంద్ర బృందానికి ఆయా ప్రాంతాల్లో చోటుచేసుకున్న నష్టాన్ని వివరించారు.

ఎక్కడ..ఏం పరిశీలించారంటే

గూడూరు రూరల్ ప్రాంతంలోని హిందూరు ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లు, కోట మండలంలోని విద్యానగర్ సబస్‌స్టేషన్, వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాళెంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ఏయే పంటలు, ఎంతమేర నష్టం వాటిల్లిందో వివరించారు. అంతేకాకుండా గూడూరు నియోజకవర్గానికి చెందిన నష్టాన్ని ఆర్డీవో కిరణ్‌కుమార్ ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా తెలియజేశారు. అలాగే సూళ్లూరుపేట పట్టణంలోని పడమటికండ్రిగ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లు, గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతంలో దెబ్బతిన్న పంటపొలాలు, తడ మండలంలోని పులివెంద్రలో పంటపొలాలు, కాదలూరులో పడిన గండ్లను, ఓజిలి మండలంలోని కిన్నెర హోటల్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్, పంట పొలాలు, స్వర్ణముఖినది ఆనకట్ట తదితర వాటిని పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తుపాను నష్టాన్ని కేంద్రబృందానికి వివరించారు. పేదలందరికీ పూర్తిస్థాయిలో సాయం చేయాలని కోరారు.

ఇప్పటి వరకు రాష్ట్రం అందించిన సేవలు

తిరుపతి జిల్లాలో 103 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 8,172 మందికి వసతి, భోజన సౌకర్యం కల్పించామని అధికారులు వివరించారు. తుపాన్ ప్రభావిత కుటుంబాలు 2,938 వారికి ఆర్థిక సహాయంగా ఒక వ్యక్తికి రూ.1000, కుటుంబానికి అయితే రూ.2,500 వంతున రూ.67 లక్షలకు పైగా తక్షణ ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అలాగే 25 కిలోల బియ్యం, ఒక్కొక్క కిలో చొప్పున కంది పప్పు, వంట నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు తదితర నిత్యావసర సరుకులు 61,183 మందికి అందించామని వివరించారు. తుపాన్ సమయంలో భాగంగా 96 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

తుపాను నష్టం.. అపారం

తుపాను కారణంగా పక్కాగృహాలు 16, పూరి గుడిసెలు, పాత ఇళ్లు 2,450 పైగా దెబ్బతిని వివరించారు. విద్యుత్‌కు సంబంధించి 496 గ్రామాల్లో 121 సబ్‌స్టేషన్లు, 2,218 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, ఆర్‌అండ్‌బీ రోడ్లు 478 కి.మీ, పంచాయతీరాజ్ రోడ్లు 132 కి.మీ, మున్సిపల్ పరిధిలో 56 కి.మీ రోడ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. జలవనరుల శాఖకు సంబంధించి 618 చెరువులు, కాలువలకు గండ్లు పడినట్టు వివరించారు. 192 పశువులు, కాటిల్ షెడ్లు 9 దెబ్బతిన్నాయన్నారు. 10 వేల హెక్టార్లకు పైగా వరి నాట్లు మునకకు గురయ్యాయన్నారు. అలాగే 2,408 హెక్టార్లలో ఇసుక మేటలు ఏర్పడ్డాయని, హార్టికల్చర్‌కు సంబంధించి 665 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఫిషరీస్, ఆక్వాకు సంబంధించి 500కుపైగా వివిధ బోట్లు, వలలు, షెడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. డీఏఓ ప్రసాద్‌రావు, ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి విజయకుమార్, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు!

- కార్యకర్తల సమ్మెబాట నేపథ్యంలో అధికారుల చర్యలు



పెంచల కిషోర్, ఇన్‌చార్జి జేసీ

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మెబాట నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతున్నారు. శుక్రవారం నుంచి పిల్లలకు పౌష్టికారంతోపాటు గర్భవతులు, బాలింతలకు టేక్ హోంరేషన్ అందించడానికి సిద్ధమయ్యారు. సచివాలయంలో పనిచేస్తున్న మహిళా పోలీసులకు రెండేళ్లుగా అంగన్‌వాడీల పర్యావేక్షణ బాధ్యత అప్పగించారు. దాంతో వారికి అంగన్‌వాడీ పాఠశాలలపై అవగాహన ఉండడంతో వారికి బాధ్యతలు అప్పగించనున్నారు. వారికి అనుసంధానంగా డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది సహకారం అందించనున్నారు. అలాగే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భోజన ఏర్పాట్ల బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ పెంచలకిషోర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె చేపట్టి నేటికి మూడు రోజులు పూర్తయిందని, ఈ క్రమంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించాల్సిన పౌష్టికాహారం, టేక్ హోం రేషన్ పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులు, ప్రధానంగా మహిళా పోలీస్, డీఆర్‌డీఏ సిబ్బంది, మెప్మా సిబ్బంది, పొదుపు సభ్యులు, పాఠశాలల్లో వంట నిర్వాహకులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సరుకులు చెడిపోకుండా చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. మరో వైపు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆన్‌లైన్ లెర్నింగ్‌పై వర్క్‌షాప్



తిరుపతి సిటీ: డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ దూర విద్య, ఆన్‌లైన్ లర్నింగ్ అనే అంశంపై మూడు రోజుల వర్క్ షాప్‌ను గురువారం యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డీ.భారతి ప్రారంభించారు. డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏం.అరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గెస్ట్ ఆఫ్ హానర్ డాక్టర్ సి.ఆర్.కె.మూర్తి, ప్రొఫెసర్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ స్టైట్ ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ఢిల్లీ విచ్చేశారు. కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ జీవితంలో వివిధ రకాలుగా స్థిరపడిన వారికి విద్యను డిస్టెన్స్ ద్వారా అందించడం ఒక మంచి విషయమన్నారు. ప్రొఫెసర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 140 కుటుంబాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన 140 కుటుంబాలకు చెందిన సుమారు 400మంది గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వారు వెల్లడించారు. 30 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లలో చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను అఖండ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రావుపవార్, రత్నంరెడ్డి, మధుసూదనరావు, సుబ్రహ్మణ్యంరెడ్డి, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, భరత్‌రెడ్డి, బుజ్జిమేస్త్రీ, కిట్టు మేస్త్రీ, మోహన్‌రెడ్డి, దాము, శంకరయ్యగౌడ్, జయ, గోపాల్, గురవారెడ్డి, లక్ష్మీపతి, రంగయ్య, నాగభూషణం, దాసు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

పశుసంపద సంరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ సర్జన్రావు

తిరుపతి సిటీ: రాష్ట్రంలో పశు సంపద సంరక్షణే లక్ష్యంగా పరిశోధనలు సాగుతున్నాయని వర్సిటీ పరిశోధక సంచాలకులు డాక్టర్ కే సర్జన్రావు తెలిపారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో గత మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యాక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ గత మూడు రోజులుగా పశు వ్యాధి నిర్ధారణ, నివారణ వంటి విషయాలను దేశ వ్యాప్తంగా ఈ సదస్సుకు విచ్చేసిన శాస్త్రవేత్తలు, పరిశోధకుల ద్వారా చర్చిండం జరిగిందన్నారు. భవిష్యత్‌లో పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణపై అప్రమత్తంగా వ్యవహరించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ పొన్నుస్వామి, డాక్టర్ దినకరన్, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాణిప్రమీల, దేశ వ్యాప్తంగా విచ్చేసి సుమారు 150 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గొల్లపల్లి సిద్ధార్థ కళాశాలలో క్యాంపస్ సెలెక్షన్స్

– 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ కొండారెడ్డి

తిరుపతి రూరల్: సీగొల్లపల్లి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం పలు మల్టీ నేషనల్ కంపెనీలు క్యాంపస్ సెలెక్షన్స్‌ను నిర్వహించాయి. కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న 12 మంది విద్యార్థులు క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చదువుతునే ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ కొండారెడ్డి, కార్యదర్శి ఆనందరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామినాథన్ అభినందించారు.

రేపు తిరుప్పావై ప్రవచనాల ప్రారంభ సమావేశం

తిరుపతి కల్చరల్: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని టీటీడీ ఆళ్వార దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 216 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. ఈమేరకు 16వ తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో తిరుప్పావై ప్రవచనాల ప్రారంభ సమావేశం జరగనుంది. టీటీడీ ఆళ్వార దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మళ్లీ జగనన్నే రావాలి

- చరిత్రలో నిలిచిపోయేలా రూ.1,700 కోట్లతో తిరుపతి అభివృద్ధి
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి 34వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: నిత్యం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారు కాబట్టే జగన్ మళ్లీ రావాలని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి నగరంలోని 11, 34, 48 డివిజన్లలో గురువారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నిర్వహించారు. ముందుగా జగనన్న సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వారి రుణం తీర్చుకునేలా సంక్షేమ పథకాలను అందించి ప్రజల్లో దేవుడయ్యారన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు రూ.3.2 లక్షల కోట్లను అందించిన నాయకుడు జగనన్న మాత్రమేనన్నారు. 14 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకున్న పాపానపోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కేవలం అధికారంలోకి రావాలన్న దురాలోచనతో అవిచేస్తా, ఇవి చేస్తానంటూ ప్రజలను మరోసారి మోసగించేందుకు చూస్తున్నాడన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా తిరుపతి అభివృద్ధి

తిరుపతి రాజకీయ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా రూ.1,700 కోట్లతో తిరుపతి అభివృద్ధి చేయగలిగామంటే అది జగనన్న చొరవ, సహకారమేనని ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి గుర్తుచేశారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సైతం తిరుపతి అభివృద్ధిని చూసి 'వావ్ వాట్‌యే డెవలప్‌మెంట్' అని ఆశ్చర్యపోతున్నారన్నారు. తిరుపతి నగరంలో మాస్టర్‌ప్లాన్ రోడ్లు, బీబీరోడ్లు, ఫ్రీలెఫ్ట్, శ్రీనివాససేతు ఫ్లైవర్, నగరంలో ఆకర్షణీయమైన పచ్చదనం, విద్యుత్ దీపాలంకరణ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు వెల్లడించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంకన్నా జగనన్న ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని భావిస్తే జగనన్నకు ఓటు వేసి గెలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, తలారి రాజేంద్ర, కార్పొరేటర్లు దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి, శ్రావణి మునిరామిరెడ్డి, సంధ్య, కోటేశ్వరమ్మ, దూది కుమారి, క్లస్టర్ ఇన్‌చార్జులు దొడ్డారెడ్డి మురళీ రెడ్డి, సురేంద్రరెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు బాలిశెట్టి కిషోర్, పార్టీ నాయకులు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, సుధాకర్, కంకనాల రమేష్, కోటి, రమణ పాల్గొన్నారు.



తిరుపతి 48వ డివిజన్‌లో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి హాజరైన ప్రజలు

జనహృదయ నేత జగనన్న



ప్రజలకు అభివాదం చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికే జగనన్న సురక్ష
- చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట: ప్రజల హృదయాల్లో సీఎం జగనన్న చెరగనిముద్ర వేశారని తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. గురువారం ఎర్రావారిపాళెం మండలంలోని యల్లమంద, ఉస్తికాయలపెంట, కోటకాడపల్లె, వి.ఆర్.అగ్రహారం, బోడేవాండ్లపల్లె గ్రామ సచివాలయాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తల నడుమ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు సొంత ఇల్లు, విద్యార్థులకు అమ్మఒడి, విద్యాదీవెన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు చేయూత, అన్నదాతలకు రైతు భరోసా వంటి పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న సురక్ష, ఆరోగ్యశ్రీ పథకాలు వర్తింపజేయడం శుభ పరిణామమన్నారు. ప్రజాసంక్షేమ పాలనకు జగన్ పట్టం కడుతున్నందుకే ఆంధ్రప్రదేశ్‌కు జగన్ మళ్లీ కావాలన్నారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గానికి చెవిరెడ్డి కుటుంబం దొరకడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ప్రజల కష్టాలు చెప్పకనే వారి అవసరాలను గుర్తించి తీర్చడం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికే సాధ్యమన్నారు. అలాంటి కుటుంబం నుంచి యువ నాయకుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారని, ఆయన్ను అందరూ ఆదరించి, ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ప్రజలు, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఎంపీపీ శివలక్ష్మి, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు నాగార్జునరెడ్డి, చెంగల్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రమేష్, మధుసూదనరెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దివ్యాంగుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 63,928 మంది స్వామివారిని దర్శించుకోగా 22,358 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.34 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అంతర్జాతీయ గురుకుల విద్యాపీఠంతో అభివృద్ధి



గురుకుల విద్యాపాఠశాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీస్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల విద్యాపీఠంతో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం మండలంలోని వికృతమాలలో నూతనంగా నిర్మించనున్న శ్రీస్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల విద్యాపీఠం నిర్మాణానికి మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావుతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషితో గురుకుల విద్యాపీఠం ఏర్పేడు మండలానికి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, తిరుపతి, పులివెందులలో అంతర్జాతీయ గురుకుల విద్యాపాఠశాలలను నిర్మిస్తామని సీఎం జగనన్నకు శ్రీస్వామి నారాయణ గురుకుల్ ట్రస్ట్ తెలియజేసిందని, ఇందులో భాగంగా వికృతమాలలో భూమిపూజ చేసినట్లు వివరించారు. గురుకుల పాఠశాల ఇక్కడకు రావడం మన పిల్లల అదృష్టమన్నారు. ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇక్కడ చదువుకోవచ్చన్నారు. వసతిగృహం, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్, డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్, మ్యాథ్స్ ల్యాబ్‌లు, యాక్టివిటీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ గదులు, ఓపెన్ థియేటర్‌లు నిర్మించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, శ్రీస్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల్ ట్రస్ట్ ప్రధాన స్వామీజీ మహంతు సాధు, దేవప్రసాద్ దాస్, సాధు శుక్ల వల్లభ దాస్, సాధునిత్య స్వరూప్ దాస్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడుయ బత్తిశెట్టి, రామ్మూర్తి, గెరటూరెడ్డి, బాలిరెడ్డి, కేశవులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు

చిల్లకూరు: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లా స్థాయి జట్టును గురువారం చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలో ఎంపిక చేశారు. ఇందులో మొత్తం 16 మంది క్రీడాకారులు ఉన్నట్టు హ్యాండ్ బాల్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శ్రీరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ బాలుర పోటీలు తెనాలిలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఇందుకుగాను ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి జట్టును ఎంపిక చేసేందుకు పోటీలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఇందులో నెల్లూరు, కోట, నాయుడుపేట, వాకాడు, చిల్లకూరు, కావలి ప్రాంతాలకు చెందిన 70 మంది క్రీడాకారులు హాజరవగా, వీరికి రెండు పర్యాయాలు పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో వివేకానంద, పీఈటీ అఖిల్‌తేజా పాల్గొన్నారు.

4,818 మంది టీటీడీ ఉద్యోగులకు ప్లాట్లు

- ఆన్‌లైన్ డిప్ ద్వారా ప్లాట్ల కేటాయింపు
- టీటీడీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్



ఇంటి స్థలాలను పరిశీలిస్తున్న టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

తిరుపతి (అలిపిరి): టీటీడీలో 1979 నుంచి 2004 జూన్ వరకు సర్వీసులో ఉన్న 3518 మంది ఉద్యోగులకు ఆన్‌లైన్ డిప్ ద్వారా వడమాలపేటలో ప్లాట్ నంబర్లను కేటాయించారని.. ఈ నెల ఆఖరిలో ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను మాంజూరు చేయనున్నట్లు టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. గురువారం అసోసియేషన్ సభ్యులు ప్లాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 ఆగస్టు తరువాత సర్వీసులో చేరిన దాదాపు 1,300 మందికి పైగా ఉద్యోగులకు ప్రస్తుతం కేటాయించిన 300 ఎకరాల స్థలం పక్కన ఉన్న 132 ఎకరాల భూమిలో ఇంటి స్థలాలు ఇస్తామన్నారు. ఈ నెల 28న శ్వేత భవనంలో 132 ఎకరాలను ఆన్‌లైన్ డిప్ ద్వారా దాదాపు 1300 మందికి పైగా ఉద్యోగులకు ప్లాట్లు కేటాయిస్తామన్నారు. మొదటి డిప్‌లో ఇంటి స్థలాలు పొందిన 3,518 మంది ఉద్యోగులతో పాటు ఇంటి స్థలాలు పొందే 1300 మందితో కలిపి ప్లాట్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్ మంజూరు చేస్తారని అధికారులు తెలిపారు. వెంకటగిరి రోడ్డులో ఉన్న ఐఐటీ వద్ద మరికొంత స్థలాన్ని సేకరించడానికి అధికారులు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యవర్గ సభ్యులు రంగా నాయక్, హేమలత, సునీల్ కుమార్, శ్రీహరి, రేఖ, కొప్పర్తి శివ, వంకీపురం పవన్, మణికంఠ, గంట భరత్, ధరణి కుమార్, పూల హరికృష్ణ, రూప్‌సాగర్, అంకయ్య, శివప్రసాద్, యుగంధర్ రెడ్డి, తులసమ్మ, గంగోజమ్మ, రవికుమార్, తేజేశ్వర్ రెడ్డి, సింగరబాబు, ఈశ్వర్ నాయక్, రవి కుమార్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాతో భవిష్యత్తు భరోసా



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

- ఇంధన పొదుపుపై విస్తృత అవగాహన అవసరం
- స్టార్ రేటెడ్ గృహోపకరణాల వినియోగానికి ప్రాధాన్యత
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు
- తిరుపతిలో ఇంధన పొదుపుపై ర్యాలీ

తిరుపతి రూరల్: భావితరాల బంగారు భవిష్యత్తు కోసం విద్యుత్‌ను ఆదా చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) సీఎండీ సంతోషరావు పిలుపునిచ్చారు. ఆయన గురువారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా తిరుపతిలో అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ తిరుపతి ఎస్ఈ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వృథాకాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. విద్యుత్‌ను ఆదా చేయడం, సంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులను వినియోగించడం ద్వారా సుమారు 60 శాతం విద్యుత్ ఆదా అవుతుందన్నారు. 3 లేదా అంతకంటే ఎక్కువ స్టార్ రేటెడ్ గృహోపకరణాలను వినియోగించాలని సూచించారు. గీజర్ల స్థానంలో సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గృహాల్లో విద్యుత్తును ఆదా చేసే అంశాలపై పాఠశాలల విద్యార్థులకు తరచూ అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333 కాల్ చేయవచ్చని, అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వాసుదేవరెడ్డి, వాసురెడ్డి, అమర్ బాబు, సోమశేఖర్, సురేష్, దామోదర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యుత్ పొదుపు నిత్య జీవితంలో భాగంకావాలి

విద్యుత్ పొదుపు నిత్య జీవితంలో భాగం కావాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం తిరుపతిలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ వాసుదేవరెడ్డి, వాసురెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

హత్య కేసులో ఏడుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: హత్య కేసులో ఏడుగురికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 10న తిరుపతి కొత్తపల్లి, చిరంజీవి రోడ్డు సమీపంలో ఒకరు హత్యకు గురయ్యారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి షేక్ అఫ్రోజు, ఎం.లోకేష్, ఎస్.బలరాం, తిరుపతి ఎరుకల కాలనీకి చెందిన పి.దేవేంద్ర, తిరుపతి చంద్రశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన ఎం.జనార్ధన్, తిరుచానూరుకు చెందిన వి.వెంకట శివకుమార్ అలియాస్ శివ, తిరుపతి పీకే లేఅవుట్‌కు చెందిన పి.హరికేశవ అలియాస్ కేశవను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.


కీచక ఉపాధ్యాయుడిపై విచారణ



వరదయ్యపాళెం హైస్కూల్‌లో విచారణ చేస్తున్న గూడూరు డీవైఈఓ శివప్రకాష్ రెడ్డి

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ అదే పాఠశాలలోని బాలికపై లైంగిక వేధింపులకు గురిచేసిన కీచక ఉపాధ్యాయుడు అంకిరెడ్డిపై గురువారం ప్రత్యేక బృందం విచారణ చేపట్టారు. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం గూడూరు డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డిని విచారణ అధికారిగా, ఆయనకు సహాయ విచారణ అధికారులుగా తడ ఎంఈఓ మల్లికార్జునరావు, శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరిని నియమించింది. ఈ నేపథ్యంలో వారు వరదయ్యపాళెం హైస్కూల్‌కు చేరుకుని సస్పెండ్ అయిన కీచక ఉపాధ్యాయుడు అంకిరెడ్డిని రోజంతా విచారించారు. అలాగే మండల ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులను వేర్వేరుగా విచారించి పలు వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే బాధిత బాలికతో చర్చించి ఆమె తెలిపే వివరాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ నివేదికను జిల్లా అధికారులకు అందజేశారు. తదుపరి వారు తీసుకునే నిర్ణయం మేరకు కీచక ఉపాధ్యాయునిపై చర్యలు ఉంటాయని వారు వివరించారు.

ఆడుదాం ఆంధ్రా ట్రయల్ మ్యాచ్‌ల నిర్వహణ



తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా గురువారం ఎస్వీయూ క్రీడా మైదానంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ట్రయల్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఇందులో భాగంగా తిరుపతి పట్టణ 23వ వార్డుకు సంబంధించి పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులకు క్రికెట్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ట్రయల్ మ్యాచ్‌లను డీఈఓ డాక్టర్ వి.శేఖర్, ఎస్వీయూ పీడీ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, డీఎస్‌డీఓ సయ్యద్‌సాహెబ్ పర్యవేక్షణలో కోచ్‌లు, పీడీ, పీఈటీలు విజయవంతంగా నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లె: శరీరంపై పెట్రోల్ పోసుకుని ఓ యువకుడు నిప్పంటించుకున్న సంఘటన గురువారం చౌడేపల్లె మండలం కాగతి గ్రామంలో చోటుచేసుకొంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు పవన్(22) మేస్త్రీ. గురువారం కాగతిలోనే కూలి పనికి వెళ్లి ఇంటికి వెళ్లాడు. కుటుంబ కలహాల కారణంగా తల్లిదండ్రులతో గొడవపడి ఇంటి ముందే పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. కేకలు స్థానికులు మంటలను ఆర్పారు. తీవ్రంగా గాయపడిన యువకుడిని 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.